ప్రజాశక్తి
సోమవారం 17 జులై 2023 5 అనంతపురం



'గడప గడప'కూ సబ్సిడీపై కూరగాయలు ఇవ్వండి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప



ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్న నేపథ్యంలో గడప గడపకూ వెళ్తున్న వైసిపి నాయకులు సబ్సిడీపై కూరగాయలు పంపిణీ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రోజువారి నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారన్నారు. టమోటాలు, పచ్చి మిరపకాయలు, కాకర, బెండ, క్యారెట్, ముల్లంగి, ఇతర కూరగాయలు కొని తినలేని పరిస్థితులకు చేరుకున్నాయన్నారు. జగనన్నకు చెప్పుకుందాం, జగనన్నకు సురక్ష, గడప గడపకూ మన ప్రభుత్వం అనే పేరుతో ప్రజల్లోకి వస్తున్న అధికార పార్టీ నాయకులు పెరుగుతున్న నిత్యావసరాల ధరలపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఒక రోజు కూలి కేవలం ఇంటి సరుకులకే సరిపోతోందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై కూరగాయలను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

కాలుష్య కుంపటిగా 'పురం' డంపింగ్‌యార్డు

పొగ, దుర్వాసనతో ప్రజలు, విద్యార్థుల ఇబ్బందులు

పట్టించుకోని పాలకులు, అధికారులు



డంపింగ్ యార్డులో పేరుకు పోయిన చెత్త దిబ్బలు

పాలకులు మారినా, అధికారులు మారినా అహ్మాద్‌నగర్, శ్రీ సత్య సాయి నగర్ ప్రాంత ప్రజల తలరాతలు మారడం లేదు. ఈ ప్రాంతాలకు పక్కన ఉన్న మున్సిపల్ డంపింగ్ యార్డు నుంచి వెలువడే పొగ, దుర్వాసనతో ప్రజలు జీవన పోరాటం చేస్తున్నారు. అదే చెత్తలో విద్యార్థులు చదుకోవాల్సిన దుస్థితి ఉంది. ఇక్కడ నుంచి డంపింగ్ యార్డు తరలిస్తామని గత కొన్ని సంవత్సరాలుగా చెబుతున్న పాలకుల, అధికారుల మాటలు నీటి మీద రాతలుగా మారుతున్నాయి.

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణం ఏర్పాటు అయిన సమయంలో పట్టణ సమీపంలోని పరిగి రోడ్డులో సుమారు 11 ఎకరాల విస్తీర్ణంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు. పట్టణ జనాభా పెరగడంతో పరిగి రోడ్డు ప్రాంతంలో సైతం జనావాసాలు ఏర్పాటు అయ్యాయి. మొదట్లో చెత్తాచెదారం తక్కువగా ఉండడం ఎలాంటి ఇబ్బంది లేక పోవడం కారణంగా ప్రభుత్వం పేదల కోసం డంపింగ్ యార్డు పక్కలోనే ఇంటి స్థలాలను కేటాయించింది. ఫలితంగా ఈ ప్రాంతంలో ఆహ్మాద్ నగర్, సత్య సాయి నగర్ రూపుదిద్దుకున్నాయి. వేలాది నిర్మాణాలు జరిగి పెద్ద ఎత్తున ఈ ప్రాంతం అభివృద్ధి చెందింది. దీంతో ప్రజలకు అవసరమైన అన్ని మౌళిక సదుపాలయాలను పురపాలక సంఘంతో పాటు ఇతర శాఖల వారు కల్పించారు. వారి పిల్లల కోసం పాఠశాలను సైతం ఏర్పాటు చేశారు. అయితే పట్టణంలో రానురాను జనాభా పెరగడం, చెత్త ఉత్పత్తి ఎక్కువ కావడం ప్లాస్టిక్ ఉత్పత్తులు పెరిగి పోవడం కారణంగా డంపింగ్ యార్డుకు చెత్త తరలింపు ఎక్కువ అయింది. ప్లాస్టిక్ ఇతర వ్యర్థాలు డంపింగ్ యార్డులో చేరడంతో చెత్త కుళ్లిపోకుండా కొండలా పేరుకు పోయింది. కొంత కాలంగా కుళ్లతున్న ఈ వ్యర్థాల నుంచి దట్టమైన పొగ వెలువడుతూ ఈ డంపింగ్‌యార్డు వాయు కాలుష్య ఉత్పత్తి కేంద్రంగా మారింది. దీంతో ఈ ప్రాంతంలో దుర్వాసన వెదజల్లుతుంది. చెత్త నుంచి మిథేన్ తదితర వాయువులతో మంటలు చెలరేగుతున్నాయి. వీటి నుంచి వెలువడే విషయువులు, పొగ సమీప ప్రాంత వాసులను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. నివాసం ఉండడానికే కష్టంగా మారింది. గత కొన్ని సంవత్సరాలు ఇలాంటి పరిస్థితి ఉండటంతో ఈ ప్రాంత ప్రజలు శ్వాసకోశ, ఇతరత్రా వ్యాధుల బారిన పడుతున్నారు. సమస్య పాలకులకు, అధికారులకు తెలిసినా పరిష్కారానికి చొరవ చూపడం లేదన్న విమర్శలు వినపడుతున్నాయి. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని ఇచ్చిన హామీలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. ఇప్పటికే ఈ డంపింగ్ యార్డు నిండి చెత్త కొండలా మారిపోయింది. నూతన డంపింగ్ యార్డుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో అడుగులు పడ్డాయి. పట్టణ సమీపంలో గుడ్డంపల్లి వద్ద దాదాపు 36 ఎకరాల స్థలాన్ని సేకరించి, డంపింగ్ యార్డును నిర్మాణం చేశారు. అయితే వివిధ కారణాలతో దానికి పూర్తి స్థాయిలో చెత్త తరలింపు జరగడం లేదు. ఇక్కడి డంపింగ్‌యార్డులోని చెత్తలో రబ్బరు, ప్లాస్టిక్, థర్మకోల్, ఫైబర్ తదితర పనికిరాని వస్తువులను వేరు చేయాల్సి ఉంది. వేరు చేసిన ప్లాస్టిక్‌ను పెన్నా సిమెంట్ పరిశ్రమకు తరలించాల్సి ఉంది. అయితే అదేదీ జరగలేదు. డంపింగ్ యార్డులో దాదాపు 61.499 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త ఉన్నట్లు అధికారులు అంచనావేసి దీని కోసం 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి 4.90కోట్లు కేటాయించారు. గుంటూరుకు చెందిన జ్ఞానేశ్వర్ ఇంజనీరింగ్ ప్రవేటు సంస్థకు 6 నెలల క్రితం పనులను సైతం ఖరారు చేశారు. అయితే ఒక వారం రోజులు పనులు చేసి అక్కడి నుంచి వెళ్లి పోయారు. దీంతో ఈ ప్రాంత ప్రజలకు డంపింగ్ యార్డు శాపంగా మారింది.



సమస్యను వివరిస్తున్న విద్యార్థుల కుటుంబసభ్యులు

శాశ్వత పరిష్కారం ఎప్పుడు..?

హిందూపురం రూరల్ మండలం గుడ్డంపల్లి సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డుకు సేకరించిన చెత్తను పూర్తి స్థాయిలో తరలించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాంపేక్టర్ ద్వారా తరలించే చెత్తను మాత్రమే ఇక్కడికి తరలిస్తున్నారు. ఆటోల ద్వారా సేకరించిన చెత్తను పట్టణంలో ఉన్నా డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. కొంత మంది ఆకతాయిలు చెత్తకు నిప్పు పెట్టడంతో దట్టమైన పొగతోపాటు, తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. శాస్త్రీయ పద్దతిలో చెత్తను వేరు చేసే కార్యక్రమంపై అధికారులు దృష్టి సారించకపోవడంతో శాశ్వత పరిష్కారానికి నోచుకోవడం లేదు.

న్యాయ పోరాటాలకు సిద్ధం



పట్టణంలో ఉన్న డంపింగ్ యార్డును తరలించాలని ఇప్పటికే పాలకులకు, అధికారులకు పలుమార్లు విన్నవించాం. అయినప్పటికి వారిలో కనీస చలనం లేదు. ఈ డంపింగ్ యార్డు వల్ల ప్రజలతో పాటు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించాలి. లేని పక్షంలో న్యాయ పోరాటాలకు సిద్ధమవుతాం.

శ్రీనివాసులు,
ఒపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు

భయపడుతూ ఉద్యోగం చేస్తున్నాం



డంపింగ్ యార్డు పక్కలోనే పాఠశాల ఉండడంతో నిత్యం భయపడుతు ఇక్కడ విధులు నిర్వహిస్తున్నాం. ఏ క్షణంలో ఎలాంటి విష పురుగులు విద్యార్థులపై దాడి చేస్తాయో...ఏ క్షణంలో పొగలు వ్యాపిస్తాయో అన్న భయంతో ఇక్కడ పని చేస్తున్నాం. ఈగలు విపరీతంగా ఉన్నాయి.

నఫీస్ సుల్తానా,
పాఠశాల హెచ్ఎం

ఊపిరితిత్తుల వ్యాధులు వచ్చే అవకాశం



డంపింగ్ యార్డులో నుంచి వెలువడే దుర్వాసన, విష వాయువు వల్ల గాలిలో ఆక్సిజన్ శాతం తక్కువ ఉంటుంది. ఈ ప్రాంతంలో కలుషితమైన గాలి ఎక్కువగా ఉండటం వల్ల చర్మం, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులు ఎక్కువగా వ్యాపించే అవకాశాలు ఉన్నాయి. పరిసరాల్లో నివసిస్తున్న ప్రజలు రోగాల బారిన పడి, ఇబ్బందులు ఎదురై, ప్రాణ నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయి.

వెంకట రమణ,
చిన్న పిల్లల వైద్యులు

చెత్తను శాస్త్రీయ పద్ధతిలో వేరుచేస్తాం



సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ కోసం మున్సిపాలిటీ ఒక ప్రణాళికను ప్రతిపాదించింది, దీని ద్వారా ప్రాసెసింగ్ చేస్తున్నాం. ఇప్పటికే దీని కోసం రూ.4.90కోట్లు నిధులు కేటాయించాం. అయితే గుత్తేదారులు పనులు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వారితో చర్చించి పనులు ప్రారంభం అయ్యే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు ఇకపై చెత్తను అక్కడికి తరలించకుండా చర్యలు తీసుకుంటాం.

ప్రమోద్ కుమార్,
మున్సిపల్ కమిషనర్



శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ముఖద్వారం

నేడు ఎస్కేయు 21వ స్నాతకోత్సవం

హాజరుకానున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం 21వ స్నాతకోత్సవానికి సిద్ధమైంది. సోమవారం జరుగుతున్న ఈ కార్యక్రమానికి ఛాన్సలర్ హోదాలో గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరుకానున్నారు. ఆదివారం రాత్రికే గవర్నర్ అబ్దుల్ నజీర్ అనంతపురం నగరం చేరుకున్నారు. నేడు జరిగే స్నాతకోత్సవంలో ఆయన పాల్గొంటారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన 57 విద్యార్థులకు బంగారు పతకాలతోపాటు 9150 మందికి డిగ్రీ పట్టాలను అందజేయనున్నారు. ఈ సందర్భంగా బెంగళూరుకు చెందిన సమర్థన దివ్యాంగుల సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ జికె.మహంతేష్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భువన విజయం ఆడిటోరియంలో స్నాతకోత్సవ కార్యక్రమం జరుగనుంది.

కట్టుదిట్టమైన భద్రత : గవర్నర్ అబ్దుల్ నజీర్ తొలిసారిగా జరుగుతున్న జిల్లా పర్యటన సందర్భంగా అనంతపురం నగరంలో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. ఆయన బస చేస్తున్న ఆర్అండ్‌బి అతిథిగృహానికి మెరుగులు దిద్దారు. ఆదివారం రాత్రికే ఆయన వస్తుండటంతో ఉదయం నుంచే ప్రధానమైన కూడళ్లలో పోలీసు పహారా ఏర్పాటు చేశారు. అదే విధంగా సప్తగిరి సర్కిల్ నుంచి ఆర్అండ్‌బి వైపు వెళ్లే మార్గంలో తోపుబండ్లను రోడ్డుకు అడ్డంగా లేకుండా పక్కకు తొలగించారు. రాత్రికి ఆయన ఇక్కడే బస చేసి సోమవారం మధ్యాహ్నం మూడున్నర గంటలకు వెనుదిరుగనున్నారు. ఈయనకు జిల్లా కలెక్టరు గౌతమి, ఎస్పీ శ్రీనివాసరావులు స్వాగతం పలికారు.

గవర్నర్ పర్యటన సాగునుంది ఇలా ... ఆదివారం మధ్యాహ్నం 3 : 45 గంటలకు గన్నవరం విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి విమానంలో బయలుదేరి 5 : 55 గంటలకు బెంగళూరుకు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో అనంతపురం బయలుదేరుతారు. మధ్యలో కొడికొండ చెక్‌పోస్టు వద్దనున్న రక్ష ఆకాడమీలో 15 నిమిషాలు విరామం తీసుకుంటారు. సాయంత్రం ఏడున్నర గంటలకు అక్కడి నుంచి బయలుదేరి రాత్రి తొమ్మిది గంటలకు ఆర్అండ్‌బి అతిథిగృహం చేరకుంటారు. రాత్రికి ఇక్కడే బస చేస్తారు. సోమవారం ఉదయం 9:15 గంటలకు అతిథిగృహం నుంచి శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి బయలుదేరుతారు. ఉదయం 9:30 గంటలకు అక్కడికి చేరుకుంటారు. గౌరవ వందనం అనంతరం శ్రీకృష్ణదేరాయ విగ్రహానికి పూలమాల వేస్తారు. అనంతరం ఇంజనీరింగు కళాశాల భవనం, ఇంజనీరింగు కళాశాల వసతిగృహం, ఇంక్యూబేషన్ కేంద్రానికి కొత్తగా వేసిన రహదారిని ప్రారంభిస్తారు. ఇవి పూర్తయిన తరువాత ఉదయం 10 :30 గంటలకు స్నాతకోత్సవం జరుగుతున్న భువన విజయం ఆడిటోరియంలోకి ప్రవేశిస్తారు. మధ్యాహ్నం 12:15 గంటలకు ఈ కార్యక్రమం ముగిస్తుంది. మధ్యాహ్నం 1:15 వరకు గంటపాటు భోజన విరామం ఉంటుంది. అనంతరం అక్కడి నుంచి నగరంలోని ఆర్అండ్‌బి అతిథిగృహం చేరుకుంటారు. మధ్యాహ్నం 2:55 గంటలకు అతిథిగృహం నుంచి బయలుదేరి మూడు గంటలకు విజయనగర లా కళాశాలకు చేరుకుంటారు. అక్కడ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం బెంగళూరుకు రోడ్డు మార్గంలో తిరుగు ప్రయాణమై వెళతారు.

కేరళ తరహాలో వైద్యులకు రక్షణ కల్పించాలి

ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ

ప్రజాశక్తి అనంతపురం

రాష్ట్ర ప్రభుత్వం వైద్యులకు కేరళ తరహాలో భద్రత కల్పించాలని ఆసుపత్రులపై దాడులను నిరోధించాలని ఐఎంఎ రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ తెలిపారు. ఆదివారం అనంతపురంలో స్థానిక ఐఎంఎ శాఖ ఆధ్వర్యంలో ప్రాంతీయ వైద్య వైజ్ఞానిక సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ భారతీయ వైద్య సంఘం(ఇండియన్ మెడికల్ అసోసియేషన్) ప్రపంచంలోనే అతి పెద్ద వృత్తి సంఘమని అన్నారు. ఐఎంఎ ప్రయివేటు వైద్యుల సంఘం అనే అపోహ ఉందని, తమ సంఘం సభ్యులు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో సేవలు అందిస్తున్నారని అన్నారు. వైద్యుల రక్షణ చట్టం పటిష్టం చేయాల్సిన అవసరం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. ఇటీవల కేరళలో యువ వైద్యురాలు వందనా దాస్ హత్యకు గురైన నేపథ్యంలో ఆ రాష్ట్రంలో వైద్య రక్షణ చట్టాన్ని కఠిన తరం చేశారని చెప్పారు. అదే తరహాలో ఆంధ్రప్రదేశ్‌లో చట్టాన్ని అమలు చేస్తే వైద్యులకు భద్రత కల్పించినట్లు అవుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కూడా జాతీయ స్థాయి వైద్యుల రక్షణ చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. వైద్యులపై కేసుల నమోదుకు నిర్దిష్ట నియమావళి ఉండాలన్నారు. రాష్ట్రంలో అధిక శాతం ప్రజలకు ప్రైవేటు రంగంలోనే వైద్యం అందుతోందనిఈ నేపథ్యంలో ప్రైవేటు ఆసుపత్రులు ఏర్పాటు చేసే సమయంలో ఉన్న వివిధ అనుమతులు,లైసెన్సులు ఏక గవాక్ష విధానంలో ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ పథకం పరిధిని మరింత విస్తృతం చేసిన ప్రభుత్వ తీరు హర్షనీయమన్నారు. అయితే 20 పడకల ఆసుపత్రులకు ఆరోగ్యశ్రీ వర్తింప చేస్తే పేద సామాన్య ప్రజలకు మరింత ప్రయోజనం ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఆసుపత్రుల నుండి సేకరించే ఆసుపత్రి వ్యర్థాల రుసుములు నిర్వహణ వ్యయానికి అనుగుణంగా ఉండాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సలహా కమిటీలో ఐఎంఎతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. శిక్షణ లేని వైద్యం చేస్తున్న క్లినిక్ ల పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, అందుకు అనుగుణంగా నేషనల్ మెడికల్ కమిషన్ సూచనల మేరకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ వైద్య పురస్కారాలు ఇవ్వాలన్నారు. ఐఎంఎ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ అన్ని రకాల వైద్య విధానాలపై ఐఎంఎకు గౌరవం ఉందని చెప్పారు. ప్రజలకు ఏ వైద్య విధానం కావాలో వారే నిర్ణయించుకుని ఆ వైద్య విధానంలో చికిత్స పొందడానికి అవకాశం కల్పించాలని, కోరారు. ఐఎంఎ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ జి.హేమలత మాట్లాడుతూ ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అందించడం కోసం రాష్ట్రములో ఉన్న 98 ఐఎంఎ శాఖల ద్వారా వైద్యులకు నిరంతర వైద్య విద్య కార్యక్రమాలు నిర్వహించి వారికి ఆధునిక వైద్య విజ్ఞాన శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. ఐఎంఎ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ మనోరంజన్ రెడ్డి ప్రతి ఐఎంఎ శాఖ ఒక గ్రామాన్ని దత్తతకు తీసుకుని ఆ గ్రామంలో సమగ్ర ఆరోగ్య రక్షణ కార్యక్రమాలు చేపట్టాలని ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు.ఈ సమావేశంలో ఐఎంఎ రాష్ట్ర కోశాధికారి రవీంద్రనాథ్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ ఎవి.సుబ్బారెడ్డి, అనంతపురం ఐఎంఎ కార్యదర్శి డాక్టర్ అభిషేక్ రెడ్డి, సీనియర్ వైద్యులు రామసుబ్బయ్య, రామ సుబ్బారావు, అచ్యుత ప్రసాద్, కొండయ్య, శ్రీనాథ్, గేయానంద్, ప్రసూన, సుధీంద్ర, సతీష్, సత్యనారాయణ, గోపి, సుప్రజ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో పాల్గొన్న ఐఎంఐ ప్రతినిధులు

'ఉపాధి' పనుల పరిశీలన

బుక్కరాయసముద్రం : మండలంలోని సిద్ధరాంపురం గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పనులను ట్రెయినీ కలెక్టర్లు ఆదివారం పరిశీలించారు. ఇందులో భాగంగా పథకం కింద చేపట్టిన పనుల ప్రాముఖ్యత, ఉపయోగం వంటి విషయాలను కూలీలు, రైతులను అడిగి తెలుసుకున్నారు. వీటి వల్ల కలిగే ప్రయోజనాలను జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి వివరించారు. ముఖ్యంగా జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పండ్ల మొక్కల పెంపకం అమలు తీరుపై అధ్యయనం చేసేందుకు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ రఘునాథ్‌రెడ్డి, ఎపిఎంఐపి అనంతపురం ఫిరోజ్ ఖాన్, ఎపిడి అనురాధ, ఉద్యానవన అధికారిణి శైలజ, తదితరులు పాల్గొన్నారు.



పండ్ల మొక్కలను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్లు

నెలాఖరులోపు 19వేల ఇళ్ల నిర్మాణాలు



హౌసింగ్ పీడీ కేశవనాయుడు

ప్రజాశక్తి -అనంతపురం

ప్రభుత్వం జిల్లాలో ఇళ్లనిర్మాణాలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈనెలాఖరునాటికి 19వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని కలెక్టర్ హౌసింగ్ అధికారులకు లక్ష్యాన్ని నిర్ధేశించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఇళ్ల నిర్మాణాల గురించి హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ కేశవనాయుడు పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న : జిల్లాలో ఇళ్ల నిర్మాణాలు ఏ విధంగా జరుగుతున్నాయి ?ఎన్ని ఇళ్లను పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించారు ?

జవాబు : జిల్లా లో ఇళ్లనిర్మాణాలు శరవేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తగిన చర్యలు చేపట్టాం. ఈ నెలాఖరుకల్లా 19వేల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

ప్ర: బిల్లుల చెల్లింపు ఏ విధంగా ఉంది ?

జ : ఇళ్ల నిర్మాణాల బిల్లులను స్టేజ్ వైజ్ చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీవరకు ఒకసారి, మిగిలిన 15 రోజులకు మరోసారి చెల్లించేలా చర్యలు తీసుకున్నాం. బిల్లులు పెండింగు లేకుండా చూస్తున్నాం.

ప్ర: జగనన్నలేఅవుట్లలో మౌలిక వసతుల కల్పన ఎలా ఉంది ?

జ: జగనన్న లేఅవుట్లలో రోడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించేలా చూస్తున్నాం. కాంట్రాక్టర్లకు 15 రోజులకు ఒకసారి బిల్లులు ఇప్పించి వేగవంతంగా వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నాం.

ప్ర : హౌసింగ్ శాఖలో సిబ్బంది సమస్యలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు ?

జ: 70 మంది వర్క్ఇన్స్‌పెక్టర్ల కొరత ఉంది. అదే విధంగా 4 డిఇ పోస్టులు, ఈఈ పోస్టు ఖాళీలు ఉన్నాయి. సచివాలయ ఇంజనీరింగు అసిస్టెంట్ల వల్ల పని నడుస్తోంది. పూర్తి స్థాయి సిబ్బందిని నియమిస్తే పనులుమరింత వేగవంతం చేస్తాం .



హౌసింగ్ పీడీ కేశవనాయుడు

ప్ర : గృహ ప్రవేశాల తేదీలు ఖరారయ్యాయా?

జ: మరో ఇరవై రోజుల్లో గృహ ప్రవేశాల తేదీలు ఖరారు కావచ్చు. అందుకు ముందస్తుగా సిద్ధమవుతున్నాం.

నకిలీ విత్తనాలతో నష్టపోతున్న రైతులు



దిగుబడి లేని పత్తిపంట

ప్రజాశక్తి - బొమ్మనహల్

మండలంలోని రైతులు నకిలీ విత్తనాలు, ఎరువులతో నష్టాలపాలవుతున్నారు. నకిలీని అరికట్టాల్సిన అధికారులు ఆమేరకు చర్యలు తీసుకోకపోవటంతో రైతులు పండించే పంటలకు దిగుబడి తగ్గి నట్టేట మునుగుతున్నారు. ప్రధానంగా పత్తిపంటను సాగు చేసి దిగుబడుల ఆశించిన స్థాయిలో లేక రైతులు నష్టాల పాలవుతున్నారు. మండలంలోని 16 రెవెన్యూ గ్రామాల పరిధిలో దాదాపు 7వేల ఎకరాలలో పత్తిపంటను సాగు చేశారు. ఎకరా విస్తీర్ణంలో పంటసాగుకు ఎరువులు, విత్తనాలు, కూలీలు, క్రిమిసంహారకమందులు మొత్తం కలిపి లక్ష రూపాయల దాకా పెట్టుబడి అవుతుంది. అయితే దిగుబడి ఎకరాకు ఐదు క్వింటాలు కంటే ఎక్కువ దాటడం లేదు. దిగుబడి ఇంత తక్కువగా రావటానికి కారణం నకిలీ విత్తనాలు, ఎరువులే కారణమని రైతులు వాపోతున్నారు. నకిలీ విత్తనాలు, రసాయనక ఎరువులు వాడటం వల్ల పంట ఎదగకపోవడం తగినంత కాపు, పూత లేకపోవడం వల్ల పంట దిగుబడి సగానికి సగం తగ్గిపోయిందని దీంతో పంటసాగుకు పెట్టిన పెట్టుబడి కూడా చేతికి అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది స్వార్థపరులు కల్తీ ఎరువులు విత్తనాలు జోరుగా అమ్ముకుని లాభాలు పొందుతుంటే ప్రభుత్వ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం వల్ల భారీగా నష్టపోతున్నారు. పుట్టగొడుగుల్లా వస్తున్న

పట్టించుకోని అధికారులు

నకిలీ విత్తనాలు, మందులను నియంత్రించే అధికారుల మౌనం రైతులకు శాపంగా మారింది. ఒక పంట ప్రారంభం నుండి ముగిసేంతవరకు దాదాపు 90 నుండి 120 రోజులు కష్టపడితే పంట చివరిలో చేతికందకపోవటంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. మండలంలోని బొమ్మనహల్, దేవగిరి, కురవల్లి, చంద్రగిరి, సిద్దాపురం, కల్లు దేవనాలి, గోవిందవాడ, దర్గా వన్నూరు, బొల్లనగుడ్డం, మైలాపురం, కొలగానహళ్లి, కృష్ణాపురం, సింగానహళ్లి గ్రామాల రైతులు సాగు చేసిన పత్తిపంటకు ఆశించిన దిగుబడి రాకపోటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అరకొరగా వచ్చిన పంటకు కూడా ఆశించిన స్థాయిలో ధర లేకపోవటంతో పంటను విక్రయించడానికి కర్నాటకకు వెళుతున్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే ధ్యేయం

ఎఫ్ఎసిఎస్ ఛైర్మన్ శ్రీరాములు, సిఇఒ ఎర్రిస్వామి

ప్రజాశక్తి-ఉరవకొండ

రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే ధ్యేయంగా కృషి చేస్తున్నామని విడపనకల్ రైతు సేవా సహకార సంఘం ఛైర్మన్ బోయ శ్రీరాములు, సిఇఒ ఎర్రిస్వామి తెలిపారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ విడపనకల్లు మండలంలోని 12 గ్రామాలు, వజ్రకరూరు మండలంలోని రెండు గ్రామాల్లో దాదాపు 2900 వందల మంది రైతులు సభ్యత్వాన్ని తీసుకున్నట్లు తెలిపారు. సభ్యత్వం తీసుకున్న రైతులకు సహకారం అందించడమే కాకుండా గ్రామాలలో పర్యటించి రైతుల సభ్యత్వాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సొసైటీ పరిధిలో రైతులకు క్రాప్‌లోన్లతో పాటు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచుతామన్నారు. రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సభ్యత్వం ఉన్న రైతులందరికీ గరిష్టంగా రూ.3లక్ష వరకూ క్రాప్ లోన్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఇతర స్వల్పకాలిక రుణాలు గరిష్టంగా రూ.12 లక్షల వరకూ 9.65 శాతం వడ్డీ రేటుతో రైతులకు అందిస్తున్నట్లు వివరించారు. అంతేగాకుండా దీర్ఘకాలిక రుణాల పరిధిలో డెయిరీ, గొర్రెల పెంపకం, ట్రాక్టర్, బోరు బావి, మోటార్ లాంటివాటికి ఐదు నుంచి తొమ్మిది సంవత్సరాల కాల పరిమితితో ఆర్థికసాయం అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సొసైటీ పరిధిలో ఉన్న రైతులు అర్హతను బట్టి రుణాలు అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సేల్స్ మెన్నులు అబీబ్, కోటేశ్వరయ్య, ఈశ్వరప్ప, తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న ఎఫ్ఎసిఎస్ ఛైర్మన్ శ్రీరాములు, సిఇఒ ఎర్రిస్వామి

ఐకమత్యంతో హక్కులు సాధించుకుందాం

మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర

ప్రజాశక్తి-తాడిపత్రి

కార్మికులంతా ఐకమత్యంగా పోరాటాలు చేసి హక్కులు సాధించుకుందామని ఎపి మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో తాడిపత్రి మున్సిపల్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ మున్సిపల్ కార్మికుల సమస్యలు పట్టించుకోవడంలేదన్నారు. కార్మికులకు సేఫ్టీ పనిముట్లు లేక విధులు నిర్వహిస్తూ మృతి చెందారన్నారు. ఇవి ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే అన్నారు. జీవితాంతం పనిచేసిన పెన్షన్ ఉండడలేదని, కోవిడ్ సమయంలో మృతిచెందిన కార్మికులకు బీమా వర్తింపజేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరీక్షలు చేయించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రశ్నించే విధానాన్ని చంపేసిన మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి నేడు ప్రశ్నించమని చెప్పడం సంతోషించదగ్గ పరిణామమన్నారు. ఇంజినీరింగ్ వర్కర్స్‌కి రిస్క్ అలవెన్స్ అమలు చేయాలని, జీవో నెంబర్ 7 ప్రకారం స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వేతనాలివ్వాలని, 0 1 0 పద్దు కింద వేతనాలు ఇవ్వాలి, 60 సంవత్సరాలు పైబడిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని అనేక మున్సిపాలిటీల్లో మృతిచెందిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించాలన్నారు. ఒక్క తాడిపత్రి మున్సిపాలిటీలోనే 11 మంది కార్మికులు చనిపోతే పటించుకోలేదన్నారు. వెంటనే ఆయా కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనలు చేపడితే కానీ కార్మికులకు పనిముట్లు ఇవ్వని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కార్యకర్తలను పోలీసులు కొడితే ఆయా పార్టీల నాయకులు ఆయా ప్రాంతాలకు వెళ్లి పరామర్శిస్తున్నారు. అదే కార్మికుల అనేకమార్లు సమస్యలపై రోడ్లెక్కి పోలీసుల దెబ్బలు తింటుంటే ఏ నాయకుడూ పరామర్శించిన పాపానపోలేదన్నారు. జరుగుతున్న పరిస్థితుల్లో దృష్ట్యా ఏ కార్మికునికి కష్టం వచ్చినా అందరం ఐకమత్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు, సిఐటియు నాయకులు జగన్మోహన్ రెడ్డి, ఉమా గౌడ్, అంజి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి


బ్యాంకు ఓబులేసు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతిచెందిన ఆదెప్పనాయుడు

గుత్తి : కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దర్శనం చేసుకుని స్వగ్రామానికి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని రజాపురం గ్రామ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యాడికి మండలం తూట్రాళ్లపల్లి కొత్తపల్లి గ్రామానికి చెందిన వ్యాపారి వేలూరు ఆదెప్పనాయుడు (53) గుంతకల్లు మండలం కసాపురం గ్రామంలో వెలిసిన నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయానికి శనివారం వెళ్లాడు. దైవదర్శనం, పూజలు నిర్వహించుకుని సాయంత్రం ద్విచక్ర వాహనంలో గ్రామానికి తిరిగి వస్తుండగా గుత్తి మండలంలోని రజాపురం గ్రామ శివారులో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఆదెప్ప నాయుడు చీకటిలో ఆ మట్టి కుప్ప కనపడకపోవడంతో దాన్ని ఢీకొని ఎగిరి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ అతన్ని 108 సిబ్బంది చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

లారీ-బస్సు ఢీ..ముగ్గురికి గాయాలు

గుత్తి : పట్టణ శివారులోని గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఎదురుగా 44వ జాతీయ రహదారిపై ఆదివారం లారీ-ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు వివరాల మేరకు.. ఎపిఎస్ ఆర్టీసీ గుత్తి డిపోకు చెందిన బస్సు ప్రయాణికులతో అనంతపురం కు బయలుదేరింది. గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో 44వ జాతీయ రహదారిపై వెళ్తుండగా కర్నూలు నుంచి అనంతపురం వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. ప్రమాదంలో కర్నూలుకు చెందిన ఆర్టీసీ కండక్టర్ నాగరాజు, బెంగళూరుకు చెందిన మాధవి, కర్నూలు జిల్లా తుగ్గలి వాసి మునిస్వామి లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వారిని అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పేకాట జూదరులు అరెస్టు

యాడికి : మండలంలోని తిప్పారెడ్డిపల్లి గ్రామ పొలిమేరలో గుట్టుగా పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ అంబటి గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. నిందితులను అరెస్టు చేయడంతోపాటు రూ.3,400 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కళాకారులకు బంగారు నంది అవార్డులు

ప్రజాశక్తి-శింగనమల

మండలంలోని చిన్న జలాలపురం గ్రామానికి చెందిన శ్రీరామ చెక్కభజన సీనియర్ గురువు కుళ్లాయప్పను బంగారు నంది అవార్డు వరించింది. ఈమేరకు తెలంగాణ రాజధాని హైదరాబాదులో ఉన్న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కోదండ శ్రీరామచెక్కభజన సీనియర్ విభాగంలో కుళ్లాయప్ప అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జెఎసి కన్వీనర్ కోదండరాం, వల్లూరి సంస్థల గ్రూప్ అధినేత శ్రీనివాస్‌రాజ్, తెలంగాణ గృహ నిర్మాణ ఛైర్మన్ శ్రీనివాసులు, నేషనల్ సెన్సార్ బోర్డు సభ్యులు, కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.


చిన్నజలాలపురం గురువు కుళ్లాయప్పకు బంగారు నంది విగ్రహాన్ని ప్రదానం చేస్తున్న అతిథులు

గుత్తి : మండలంలోని బసినేపల్లి గ్రామ వాసి ఎస్. మహబూబ్ బాషాకు బంగారు నంది అవార్డు దక్కింది. వివిధ కళా రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి జీసిఎస్ అల్లూరి గ్రూప్ ఆధ్వర్యంలో హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన్ భవన్‌లో 2023 సంవత్సరానికి సంబంధించి బంగారు నంది అవార్డుల ప్రధానోత్సవం ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా చెక్కభజనలో ప్రతిభ చాటిన గుత్తి మండలం బసినేపల్లికి చెందిన ఎస్.మహబూబ్‌బాషాకు నిర్వాహకులు బంగారు నంది అవార్డును ప్రదానం చేశారు. అవార్డు గ్రహీతను పలువురు ప్రముఖులు, తోటి కళాకారులు, స్నేహితులు అభినందించారు. మరిన్ని అవార్డులు అందుకోవాలని వారు ఆకాంక్షించారు.


బసినేపల్లి మహబూబ్‌బాషాకు బంగారు నంది విగ్రహాన్ని ప్రదానం చేస్తున్న అతిథులు

19న చలో విజయవాడను జయప్రదం చేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 19న నిర్వహిస్తున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్ పిలుపునిచ్చారు. ఆదివారం గణేనాయక్ భవన్‌లోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారభమై 2 నెలలు పూర్తి కావస్తున్న ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వలేదన్నారు. విద్యా రంగాన్ని ప్రతిష్టాత్మకంగా సమూలమైన మార్పులు తెస్తామని చెబుతున్న వైసిపి ప్రభుత్వం సకాలంలో పుస్తకాలు ఎందుకు ఇవ్వడం లేదన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులను చదువుకు దూరం చేయాలనె కుట్ర చేస్తోందా.. అంటూ ప్రశ్నించారు. పాఠ్యపుస్తకాలపై అధికారులను అడిగితే స్పందించడం లేదన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసేలా నిరసనలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నెల 17, 18 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో ఆర్‌డిఓ, తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఈనెల 19న జిల్లా విద్యార్థులతో కలిసి చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్ బోర్డు సెక్రటరీ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. పాఠ్యపుస్తకాలు ఇచ్చేంత వరకు దశలవారీగా ఉద్యమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు రజిత, ముఖ్య నాయకులు వెంకీ, సిద్ధు, సూర్య ప్రకాష్, గిరి, బీమా, అశోక్, వంశి, వరుణ్, శివ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్

గడేకల్ సర్పంచి మృతికి నివాళి

ఉరవకొండ : విడపనకల్ మండల పరిధిలోని గడేకల్ సర్పంచి ఉమాశంకర్ తల్లి తాసి హంపమ్మ (77) ఆదివారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, వైస్ ఎంపిపి రాకెట్ల పుష్పావతి భీమ్‌రావు, జెసిఎస్ మండల కన్వీనర్ భరత్‌రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ బసన్నతోపాటు పలువురు మృతదేశానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో గడేకల్ మాజీ సర్పంచులు మేకల పంపాపతి, కరణం భీమిరెడ్డి, ఉరవకొండ మార్కెట్ డైరెక్టర్ రమేష్, ఎంపిటిసి ఓబులేష్, సర్పంచులు కేశన్న, రామాంజనేయులురెడ్డి, వివిధ గ్రామాల నాయకులు, తదితరులు ఉన్నారు.

మొహర్రం వేడుకలను ప్రశాంతంగా చేసుకోవాలి

గుత్తి : గ్రామాల్లోని ప్రజలు మొహర్రం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని పామిడి సీఐ రాజశేఖర్‌రెడ్డి సూచించారు. ఆదివారం పామిడి మండలంలోని కత్రిమల గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సిఐ మాట్లాడుతూ మతసామరస్యానికి ప్రతికైనా పీర్ల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు చేపడుతామని హెచ్చరించారు.

మానసిక దివ్యాంగులకు అన్నదానం

తాడిపత్రి రూరల్ : మంత్రి ఉషాశ్రీచరణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మానసిక దివ్యాంగుల మహిళ ఆశ్రమంలో అన్నదానం చేశారు. ముందుగా కేక్ కోసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా పైలా మాట్లాడుతూ మంత్రికి ఆయురారోగ్యాలు కలగడంతోపాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు.

కంటి వైద్యులు అక్బర్‌సాహెబ్ సన్మానం

అనంతపురం : స్థానిక మెడికల్ కళాశాలలోని ఆడిటోరియంలో నిర్వహించిన సీఎంఇ సెమినార్ వేదికగా ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ అక్బర్ సాహెబ్‌ను ఐఎంఎ రాష్ట్ర కమిటీ సభ్యులు ఆదివారం ఘనంగా సత్కరించారు. అనంతపురంలోని మెడికల్ కళాశాల ఆడిటోరియంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐఎంఎ సంఘం కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అక్బర్ ఐఎంఏ ప్రెసిడెంట్‌గా, రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా, సెక్రటరీగా 25 సంవత్సరాలుగా సేవలందించినందుకు రాష్ట్ర ఐఎంఏ సంఘం లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డుతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ శ్రీహరి, రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ మనోరంజన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ హేమలత, రాష్ట్ర కోశాధికారి డాక్టర్ రవీంద్రనాథ్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ ఎ.వి.సుబ్బారెడ్డి, అనంతపురం ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ మనోరంజన్‌రెడ్డి, శాఖ కార్యదర్శి డాక్టర్ అభిషేక్ రెడ్డి, మహిళా విభాగం డాక్టర్ హేమలత సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో 2023-24 విద్యా సంవత్సరంలో పదోతరగతి, ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన నాయీబ్రాహ్మణ విద్యార్థులు ప్రతిభా పురస్కారాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.వెంకటరంగయ్య, ఎం.శివశంకర్ తెలిపారు. ఆదివారం సంఘం కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని నాయీబ్రాహ్మణ విద్యార్థులకు సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివి 460 మార్కులు పైబడి సాధించిన విద్యార్థులు, ప్రయివేట్ పాఠశాలల్లో 500 పైబడి మార్కులు సాధించిన విద్యార్థులు, ఇంటర్మీడియట్ ప్రభుత్వ కళాశాల విద్యార్థులు 850 పైబిడి మార్కులు, ప్రయివేట్ కళాశాల విద్యార్థులు 900 పైబడి మార్కులు సాధించిన విద్యార్థులు ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సెప్టెంబర్ 10న అనంతపురం నగరంలోని జీసెస్ నగర్‌లోని జయమణెమ్మ కళ్యాణమండపంలో ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయిబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా కోశాధికారి సి.నాగరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.శ్రీనివాసులు, గౌరవాధ్యక్షులు ఎం.సుబ్రమణ్యం, సలహాదారులు టి.శివప్రసాద్, ఉపాధ్యక్షులు వి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జనసేనతోనే రాష్ట్రాభివృద్ధి

జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్

ప్రజాశక్తి-అనంతపురం

చిత్తశుద్ధి, నిబద్ధత కలిగిన పవన్‌కళ్యాణ్ నాయకత్వంలోని జనసేన పార్టీతోనే అభివృద్ధితోనే సాధ్యమవుతుందని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు, అర్బన్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి టిసి.వరుణ్ అన్నారు. ఆదివారం నగరంలోని స్థానిక 27వ డివిజన్‌కు చెందిన ములివేలి తాతయ్య ఆధ్వర్యంలో వైసిపి టిడిపికి చెందిన 50 మంది పెద్దలు, యువకులు జనసేనలో చేరారు. అనంతరం అశోక్‌నగర్‌లో వైసిపి నగర అధ్యక్షులు పొదిలి బాబూరావు అధ్యక్షత ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అధికార వైసిపి నాలుగేళ్ల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. నగరంలో ఏమాత్రం అభివృద్ధి కానరావడం లేదదన్నారు. కేవలం కేంద్రం నిధులతో జరిగిన పనులను వైసిపి తమ గొప్పలుగా చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కాగా జనసేనలోకి చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యక్రమాల ప్రధాన కార్యదర్శి భవానీ రవికుమార్, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు మురళీకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు జయరామ్‌రెడ్డి, అంకే ఈశ్వరయ్య, కార్యదర్శులు రాపా ధనుంజయ్, సంజీవరాయుడు, కిరణ్‌కుమార్, జయమ్మ, అవుకు విజయకుమార్, ముప్పూరి కృష్ణ, నగర ఉపాధ్యక్షులు సదానందం, గ్రంధి దివాకర్, జక్కిరెడ్డి ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.


జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్‌కు స్వాగతం పలుకుతున్న ప్రజలు

ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయం

ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయంగా ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ పని చేస్తోందని ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు అన్నారు. ఆదివారం నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో ఎపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి సతీష్‌కుమార్ అధ్యక్షతన గార్లదిన్నె మండల శాఖ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎపిటిఎఫ్ గార్లదిన్నె మండల కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా కె.ఈశ్వరయ్య, మండల అధ్యక్షులుగా జి.పోతులయ్య, మండల ప్రధాన కార్యదర్శిగా ఎస్.మహేష్‌కుమార్, ఆడిటర్లు బి.బలరాముడు, ఉపాధ్యక్షులు కె.వెంకటరమణ, బి.గురుప్రసాద్, బి.రజియాబేగం, సి.నాగభూషణం, బండి పర్వతయ్య, కార్యదర్శులు ఎస్.నారాయణస్వామి, పి.లక్ష్మీనరసు, బి.అనిల్‌కుమార్, ఎం.ఉమామహేశ్వరి, బాబా ఫక్రుద్దీన్, జిల్లా కౌన్సిలర్లు కోటిగారి వన్నప్ప, టి.రంగనాయకును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్, రాష్ట్ర కౌన్సిలర్ రమణ, సర్దార్‌వలి, గార్లదిన్నె మండల పూర్వ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చిదంబరయ్య, హిమగిరి వరప్రసాద్, అనిల్‌కుమార్, సూర్యనారాయణ, బాలకదిరప్ప, హర్షద్ తదితరులు పాల్గొన్నారు.


నూతన సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

నిజాయితీకి మారుపేరు 'బ్యాంకు ఓబులేసు'

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

నిబద్ధతకు మారుపేరు వైసిపి పట్టణ అధ్యక్షుడు చల్లా (బ్యాంకు) ఓబులేసు అని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి కొనియాడారు. ఆదివారం స్థానిక ఉరగాద్రి కళ్యాణ మండపంలో మాజీ జెడ్పిటిసి తిప్పయ్య అధ్యక్షతన బ్యాంకు ఓబులేసు సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా ఓబులేసు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ఓబులేసుతో తనకున్న సాన్నిహిత్యాన్ని గుర్తుకు చేసుకున్నారు. విద్యార్థి సంఘం నాయకుడిగా, ఉద్యోగం వచ్చాక బ్యాంకు ట్రేడ్ యూనియన్ నేతగా, రిటైర్‌మెంట్ తర్వాత వైసిపి నాయకుడిగా పని చేసి అందరి మన్ననలు పొందారన్నారు. ఆయన మృతి తీరని లోటన్నారు. క్రమశిక్షణతో పనిచేస్తూ స్వలాభం కాకుండా ఎదుటివారికి కష్టమొచ్చినా తన సొంత పనిగా భావించేవారన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రజక కార్పొరేషన్ ఛైర్మన్ మీసాల రంగన్న, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, వైసిపి బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు వీరన్న, వైస్ ఎంపిపి నరసింహులు, జెసిఎస్ మండల కన్వీనర్ తేజోనాథ్, పెన్నఅహోబిలం ఆలయం మాజీ ఛైర్మన్ అశోక్‌కుమార్, గ్రామీణ బ్యాంకు రిటైర్డ్ రీజినల్ మేనేజర్ రంగన్న, రిటైర్డ్ మేనేజర్లు గోవిందరెడ్డి, బాలకృష్ణ, సుబ్బరాయుడు, ఫక్రుద్దీన్, మాజీ ఎంఇపపిలు ఎసి ఎర్రిస్వామి, నాగేశ్వరరావు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నేత కృష్ణప్ప, శ్రీనివాసులు ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు ఓబులేసు, ఎర్రిస్వామి, ఓబులేసు కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.


బ్యాంకు ఓబులేసు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ఎంపి, ఎమ్మెల్యేను కలిసిన మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ సునీత

ప్రజాశక్తి-పుట్లూరు

ఎంపి తలారి రంగయ్య, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతితోపాటు ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డిని శింగనమల మార్కెట్ యార్డు నూతన ఛైర్‌పర్సన్ భూమిరెడ్డి సునీత ఆదివారం వేర్వేరుగా వారి స్వగృహాల్లో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనను మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్‌గా నియమించడం ఎప్పటికీ మరువలేమన్నారు. అంతేగాకుండా తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా రైతుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. వారిని కలిసిన వారిలో నాగార్జునరెడ్డి, ఎంపిపి రాఘవరెడ్డి, గూడూరు ఎంపిటిసి నాగార్జునరెడ్డి తదితరులు ఉన్నారు.


ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి బొకే అందజేస్తున్న శింగనమల మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ భూమిరెడ్డి సునీత

చంద్రబాబును సిఎం చేద్దాం..: బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-పుట్లూరు

వచ్చే సాధారణ ఎన్నికల్లో ప్రతి ఒక్కరం సైనికుల్లా పని చేసి టిడిపి అధినేత చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకుందామని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని కోమటికుంట్ల గ్రామంలో శ్రావణిశ్రీ పర్యటించారు. ఇందులో భాగంగా గ్రామంలోని నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పని చేసి వచ్చే ఎన్నికల్లో టిడిపి ఘన విజయం సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రామచంద్రనాయుడు, జయచంద్రారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.


నాయకులతో మాట్లాడుతున్న టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-శింగనమల

మండల కేంద్రంలోని పాఠశాలలో పని చేస్తూ గత జూన్ నెలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ఆదివారం స్థానిక పాఠశాలలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఇఒ నరసింహరాజు మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీ సర్వసాధారణమన్నారు. ముఖ్యంగా ఉపాధ్యాయులు ఎక్కడికి వెళ్లినా విద్యార్థులకు మంచి విద్యాబోధన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కెసి ఆనంద్, సూర్యనారాయణరెడ్డి, రాజేంద్రప్రసాద్, కృష్ణారెడ్డి, శ్రీనివాసులు, శ్రీనివాసులుమూర్తి, బివి నాయక్, రామ్మూర్తి, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ తెలుగు సాహిత్య, సాంస్కృతిక అకాడమీ జాతీయ అధ్యక్షుడిగా 'గుత్తా'

ప్రజాశక్తి-అనంతపురం



ప్రపంచ తెలుగు సాహిత్య, సాంస్కృతిక అకాడమీ జాతీయ అధ్యక్షుడిగా ప్రముఖ కవి, రచయిత, సామాజిక కార్యకర్త గుత్తా హరిసర్వోత్తమనాయుడు ఎంపికయ్యారు. ఈమేరకు శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ ఛైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఉత్తర్వులు జారీచేశారు. అకాడమీ విస్తృతస్థాయి సమావేశంలో సభ్యులందరూ ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందన్నారు. రెండేళ్లపాటు కాలానికి గుత్తా హరి జాతీయ అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తించనున్నట్లు తెలిపారు. గుత్తా హరిసర్వోత్తమనాయుడు ఎంపికవడం పట్ల శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రమేష్ నారాయణ, ప్రముఖ విద్యావేత్తలు నల్లాని రాజేశ్వరి, గొర్తి వెంకటస్వామి, హైకోర్టు న్యాయవాది సాకే నరేష్, శ్రీశ్రీ కళావేదిక యూనివర్శిటీ విభాగం రాష్ట్ర కన్వీనర్ బత్తల అశోక్‌కుమార్, వేదిక జిల్లా అధ్యక్షుడు గోపాలకష్ణ, ప్రధాన కార్యదర్శి టివి రెడ్డి, కార్యదర్శులు డి.కుళ్లాయప్ప, ఎస్.రామాంజనేయులు, పేరూరు బాలకృష్ణ, అల్తాఫ్, పాల్వాయి రాధిక, తిరుపతి జిల్లా గౌరవాధ్యక్షుడు, ప్రముఖ సాహితీవేత్త వి.ఆర్ రాసాని, తదితరులు అభినందనలు తెలిపారు.

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం

ప్రజాశక్తి-అనంతపురం

నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలామురళి ఆదివారం నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్.నిర్మలామురళి మాట్లాడుతూ ట్రస్టు సభ్యులు ప్రవాస భారతీయులు కల్లమడి రవీంద్రనాథ్, రమాదేవి మనవరాలు ఆశా పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేసినట్లు తెలిపారు. ప్రపంచంలో మనం ఎక్కడ ఉన్నా మన ప్రాంత ప్రజలకు సహాయం చేయాలనే భావన ప్రతి ఒక్కరిలో రావాలన్నారు. ఇతర దేశాల్లో ఉన్న మన వ్యక్తులు వారి వేడుకలు, జ్ఞాపకార్థాలను గుర్తుగా మన ప్రాంతంలో పేదలకు సాయం చేస్తే చిరకాలం గుర్తుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కవీన్ ఆదిత్య, సుబ్రహ్మణ్యం, ఓబుళపతి, కిష్టప్ప, సుబ్బారావు, నల్లప్ప, జగన్నాథ్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలామురళి

మంత్రి జోగి రమేష్ నోరు అదుపులో పెట్టుకోవాలి

ప్రజాశక్తి-అనంతపురం

మంత్రి జోగి రమేష్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని, లేకుంటే ప్రజలే బుద్ధి చెబుతారని టిడిపి బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల లక్ష్మీనరసింహులు ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేష్, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కళ్యాణ్‌పై మంత్రి జోగి రమేష్ అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. రాష్ట్రానికి పట్టిన దరిద్రం వైసిపి ప్రభుత్వం అన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయకుండా, రాష్ట్రంలో పరిశ్రమలు లేకుండా చేస్తున్న సిఎం జగన్‌ను కుర్చీ దింపే రోజులు అతి దగ్గరలోనే ఉన్నాయన్నారు. జోగి రమేష్ లాంటి మంత్రులు అందరూ తట్టా పుట్టా సర్దుకోవాలని ఎద్దేవా చేశారు.



మాట్లాడుతున్న పోతుల లక్ష్మీనరసింహులు